- ‘డబుల్ ఇండ్ల’కు ట్యాంకరే దిక్కు!

నిజామాబాద్ జిల్లా కోటగిరి మండలం రాంపూర్‌లో డబుల్ బెడ్ రూం ఇండ్ల కాలనీలో తాగునీటి సమస్య వేధిస్తున్నది. సమస్యను అధికారుల దృష్టికి తీసుకెళ్తే రోడ్డు నిర్మాణంలో మిషన్ భగీరథ పైప్‌లైన్ ధ్వంసం కావడంతో నీటి సరఫరా నిలిచిపోయిందంటూ సమాధానమిస్తున్నారు. దీంతో పంచాయతీ ట్యాంకర్ ద్వారా నీటిని సరఫరా చేస్తున్నారు. –కోటగిరి

- పాలాల్లోకి దూసుకెళ్లిన ఆర్టీసీ బస్సు

రాజన్న సిరిసిల్ల జిల్లా గంభీరావుపేట మండలం గోరంటాల శివారులో శుక్రవారం కామారెడ్డి ఆర్టీసీ డిపో బస్సు అదుపు తప్పి పంట పొలాల్లోకి దూసుకెళ్లింది. బస్సులో ప్రయాణిస్తున్న 15 మంది ప్రయాణికులకు గాయాలు కావడంతో సిరిసిల్ల ఏరియా దవాఖానకు తరలించారు. ఘటనా స్థలాన్ని డిపో మేనేజర్ ఇందిర పరిశీలించారు. –గంభీరావుపేట

గుడిపేటలో పంచాయతీ కార్యాలయానికి వచ్చి నిరసన తెలుపుతున్న మహిళలు

గుడిపేటను కార్పొరేషన్‌లో కలపొద్దు

మంచిర్యాల, జనవరి 31 (నమస్తే తెలంగాణ ప్రతినిధి): మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్‌లో తమ గ్రామ పంచాయతీని విలీనం చేయొద్దని గుడిపేటకు చెందిన ఉపాధి హామీ కూలీలు డిమాండ్ చేశారు. మంచిర్యాల మున్సిపాలిటీని కార్పొరేషన్‌గా మారుస్తూ ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం గెజిట్ విడుదల చేసింది. మంచిర్యాలతోపాటు నస్పూర్ మున్సిపాలిటీ, హాజీపూర్ మండలం పోచంపాడ్, గుడిపేట, నర్సింగాపూర్, నంనూర్, చందనాపూర్, ముల్కల, కొత్తపల్లి, వేంపల్లి పంచాయతీలను కార్పొరేషన్‌లో విలీనంచేసింది. కాగా గుడిపేట ఉపాధిహామీ కూలీలు తమ పంచాయతీని కార్పొరేషన్‌లో కలపొద్దంటూ శుక్రవారం పంచాయతీ కార్యాలయం ఎదుట నిరసనకు దిగారు. కలెక్టర్, మున్సిపల్ కమిషనర్‌కు కలిపి వినతిపత్రాలు ఇస్తామన్నారు. అప్పటికీ వారు స్పందించకపోతే ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని పేర్కొన్నారు.

గురుకుల విద్యార్థులను చితకబాదిన ప్రిన్సిపాల్

- అల్లరి చేశారంటూ.. గదిలో బంధించి దాడి
- నల్లగొండ మైనార్టీ గురుకులంలో ఘటన
- పాఠశాల వద్ద విద్యార్థుల తల్లిదండ్రుల ఆందోళన

ఉపాధ్యాయులను నిలదీస్తున్న విద్యార్థుల తల్లిదండ్రులు

ఉపాధ్యాయులు కొట్టడంతో విద్యార్థి తొడపై కమిలిన దృశ్యం

రామగిరి, జనవరి 31: పిల్లల భవిష్యత్తుకు బాటలు వేయాల్సిన ఉపాధ్యాయులు కర్కశత్వంతో వారిని గదిలో బంధించి చితకబాదిన ఘటన నల్లగొండ జిల్లా కేంద్రం సమీపంలోని ఎస్ఎల్‌బీసీ మైనార్టీ బాలుర గురుకుల పాఠశాలలో శుక్రవారం వెలుగు చూసింది. పాఠశాల గోడలమీద రాతలు రాశారంటూ 7వ తరగతికి చెందిన 10 మంది విద్యార్థులను ఈ నెల 28న గదిలో బంధించి ప్రిన్సిపాల్ వేణుగోపాల్, ఉపాధ్యాయులు జ్యోతిబసు, బాబా వైర్లు, కర్రలతో చితకబాదారు. శుక్రవారం తల్లిదండ్రులు పాఠశాలకు వచ్చి చూడగా ఓ పిల్లవాడి ఒంటిపై వాతలు, రక్తం వచ్చినట్లు గాట్లు ఉండడంతో ఏమి జరిగిందని ఆరాతీశారు. దాంతో తమను ఉపాధ్యాయులు కొట్టినట్టు సదరు విద్యార్థి తల్లిదండ్రులకు చెప్పడంతో విషయం బయటకు వచ్చింది. ఇదే విషయమై విద్యారుల తల్లిదండ్రులు పాఠశాల ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులను ప్రశ్నించగా వారు విద్యార్థులు గోడలపై రాతలు రాయడంతో క్రమశిక్షణ చర్యలు తీసుకున్నట్టు చెప్పారు. తల్లిదండ్రులు పాఠశాల వద్ద ఆందోళనకు దిగగా ఉపాధ్యాయులు క్షమాపణ చెప్పడంతో పాటు మళ్లీ ఇలాంటి ఘటన జరుగకుండా చూస్తామని బతిమిలాడారు.దాడిచేసిన వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

చేయిచేయి కలిపి.. పూడికతీత చేపట్టి!

- నీటి నిల్వ పెంచేందుకు ముందుకొచ్చిన రైతులు

అయిజ, జనవరి 31 : జోగుళాంబ గద్వాల జిల్లా అయిజ మండలం బింగిదొడ్డి చెరువులో నీటి నిల్వలు పెంచేందుకు రైతులు ముందుకొచ్చారు. తాటికుంట రిజర్వాయర్ నుంచి బింగిదొడ్డి చెరువుకు నీరొచ్చేందుకు తూము ఉన్నా కాల్వ పూర్తికాకపోవడంతో నీటి చేరిక ఆలస్యమవుతున్నది. ఈ విషయాన్ని ఇరిగేషన్ అధికారుల దృష్టికి తీసుకెళ్లినా స్పందన లేకపోవడంతో మత్స్య సహకార సంఘంతో కలిసి 15 మంది కర్షకులు స్వచ్ఛందంగా కదిలారు. నెట్టెంపాడు ప్రాజెక్టు పరిధిలోని తాటికుంట రిజర్వాయర్ నుంచి బింగిదొడ్డి చెరువు వరకు నీటిని పారించేందుకు 3 కిలోమీటర్ల డీ-1 కాల్వలో పూడికతీత తొలగింపు పనులు శుక్రవారం చేపట్టారు. ముళ్లపొదల తొలగింపు పనులకు రూ.3 లక్షల వరకు ఖర్చు కావచ్చని, సొంతంగా డబ్బులు వేసుకొని పనులు చేపడుతున్నట్టు రైతులు తెలిపారు.

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కలెక్టరేట్‌లోని డీఎంహెచ్ఎం కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న పీవైఎల్, పీవోడబ్ల్యూ నాయకులు

దవాఖానల్లో ఫీజుల దోపిడీని అరికట్టండి

కొత్తగూడెం గణేష్ టెంపుల్, జనవరి 31 : ప్రభుత్వ ఆసుపత్రులను బలోపేతం చేయాలని, ప్రైవేటు, కార్పొరేట్ ఆసుపత్రుల్లో ఫీజుల దోపిడీని అరికట్టాలని డిమాండ్ చేస్తూ పీవైఎల్, పీవోడబ్ల్యూ ఆధ్వర్యంలో భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కలెక్టరేట్‌లోని డీఎంహెచ్‌వో కార్యాలయం ఎదుట శుక్రవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ పార్టీ జిల్లా నాయకులు చంద్ర అరుణ, వాంకుడోతు అజయ్‌లు మాట్లాడుతూ ప్రభుత్వ దవాఖానల్లో మెరుగైన వైద్యం అందకపోవడంతో నిరుపేదలు ప్రైవేటు ఆసుపత్రులను ఆశ్రయిస్తున్నారని, దీనిని ఆసరా చేసుకుని ఫీజుల పేరిట దోపిడీకి పాల్పడుతున్నారని ఆరోపించారు. వివిధ రకాల టెస్టులు, మందుల పేరుతో లక్షల బిల్లులు వేస్తున్నారని మండిపడ్డారు. పై సమస్యలు పరిష్కరించని పక్షంలో తమ సంఘాల ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఉద్యమాలు చేపడుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఆయా సంఘాల నాయకులు బుచ్చిరాజు, సావిత్రి, కెచ్చల కల్పన, ధరావత్ దేవా, కొర్స రామకృష్ణ, పూనెం మంగయ్య, లక్ష్మణరావు, దుర్గ, నూపా సరోజిని, కల్లూరి పద్మ పాల్గొన్నారు.

సీఐపై జ్యుడీషియల్ విచారణ జరిపించాలి

జమ్మికుంట సీఐ బాధితుల డిమాండ్

హుజూరాబాద్, జనవరి 31: కరీంనగర్ జిల్లా జమ్మికుంట సీఐ వరగంటి రవిపై జ్యుడీషియల్ విచారణ జరిపించాలని సామాజిక కార్యకర్త షేక్ షాబీర్ అలీ, దళిత సంఘం నాయకుడు అంబాల రాజు, సీఐ బాధితులు డిమాండ్ చేశారు. శుక్రవారం వారు జమ్మికుంటలో ప్రెస్‌మీట్ నిర్వహించారు. కాటేపల్లి లక్ష్మి అనే వృద్ధురాలు మాట్లాడుతూ తనకు సంబంధించిన భూమిని ఏనుగు జయపాల్‌రెడ్డి ఆక్రమించుకోవాలని చూస్తున్నాడని సీఐకి పలుమార్లు విన్నవించినా పట్టించుకోలేదని ఆరోపించారు. ఆర్డీవో నిర్లక్ష్యంతో తనకు అన్యాయం జరిగిందని వాపోయింది. కాటిపల్లి సంధ్యారాణి మాట్లాడుతూ సీఐ అరాచకాల మూలంగా తాను కట్టుబట్టల్లో మూత్రం పోసుకోవాల్సిన దుస్థితి వచ్చిందని ఆవేదన వ్యక్తంచేశారు. సీఐ అరాచకాలతో పాటు అతడిని కాపాడుతున్న ఏసీపీపై కూడా క్షేత్రస్థాయి విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. అధికారులు చర్యలు తీసుకోకపోతే ఉద్యమాలు చేపడతామని హెచ్చరించారు.

వీర్ల నర్సవ్వ *ఆది రాజవ్వ*

మహా కుంభమేళాకు వెళ్లి ..

తప్పిపోయిన జగిత్యాలవాసులు

జగిత్యాల కలెక్టరేట్, జనవరి 31 : మహాకుంభమేళాలో జగిత్యాలకు చెందిన ఇద్దరు మహిళలు తప్పిపోయారు. బాధిత కుటుంబసభ్యుల కథనం ప్రకారం.. జగిత్యాల జిల్లాకేంద్రంలోని విద్యానగర్‌కు చెందిన వీర్ల నర్సవ్వ (56), కొత్తవాడకు చెందిన ఆది రాజవ్వ (55)తోపాటు పట్టణానికి చెందిన మరో ఎనిమిది మంది, కడెంకు చెందిన మరో ఇద్దరు మహిళలు కలిసి జనవరి 27న ఉత్తరప్రదేశ్‌లోని ప్రయాగ్‌రాజ్‌లో మహాకుంభమేళాకు వెళ్లారు. 28న అక్కడికి చేరుకున్నారు. అదే రోజు రాత్రి వీర్ల నర్సవ్వ, ఆది రాజవ్వ తప్పిపోయినట్టు వీరితో వెళ్లిన మహిళలు జగిత్యాలలోని బంధువులకు సమాచారం అందించారు. ఆచూకీ కనిపెట్టేందుకు బంధువులు ప్రయాగ్‌రాజ్‌కు బయలుదేరినట్టు తెలిసింది.

ఆదిలాబాద్ అడవుల్లో అరుదైన హైనా

హైదరాబాద్/ ఆదిలాబాద్, జనవరి 31(నమస్తే తెలంగాణ) : ఆదిలాబాద్ జిల్లా అడవుల్లో అరుదైన హైనా కెమెరాకు చిక్కింది. ఈ నెల 28 మావల మండలం అర్బన్ ఫారెస్ట్‌లో అటవీశాఖ అధికారులు ఏర్పాటుచేసిన సోలార్ సిస్టం సీసీ కెమెరాలో హైనా తిరుగుతున్న దృశ్యాలు రికార్డయ్యాయి. దేశంలోనే అరుదైన చారల హైనా ఆదిలాబాద్ అడవుల్లో సీసీ కెమెరాకు చిక్కడం అడవులు, వన్యప్రాణులు, పర్యావరణ పరిరక్షణకు తీసుకుంటున్న చర్యల ఫలితమేనని అటవీ అధికారులు తెలిపారు. ఎఫ్ఆర్‌వో గులాబ్‌సింగ్ మాట్లాడుతూ.. ఎప్పుడో కొన్నేండ్ల క్రితం కనిపించకుండా పోయిన హైనాలు తిరిగి మావల హరితవనంలో కనిపించడం సంతోషంగా ఉందన్నారు.

ఏడుగురు మావోయిస్టుల లొంగుబాటు

కొత్తగూడెం ప్రగతి మైదాన్, జనవరి 31 : మావోయిస్టుల ఆపరేషన్స్‌లో క్రియాశీలకంగా పాల్గొన్న ఏడుగురు మావోయిస్టులు ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం కాంకేర్ జిల్లా పోలీస్ అధికారుల ఎదుట లొంగిపోయారు. శుక్రవారం పోలీసులు మీడియా సమావేశంలో వివరాలను వెల్లడించారు. లొంగిపోయిన వారిలో డీవీసీఎం మమతతోపాటు ముగ్గురు మావోయిస్టుల్లో ఒక్కొక్కరిపై రూ.8 లక్షలు, ఒక సభ్యుడిపై రూ.5 లక్షలు, మిగతా ఒక్కొక్కరిపై రూ.లక్ష చొప్పున రివార్డులు ఉన్నట్టు పేర్కొన్నారు.

లొంగిపోయిన మావోయిస్టుల వివరాలు వెల్లడిస్తున్న కాంకేర్ జిల్లా పోలీస్ అధికారులు

సమావేశంలో మాట్లాడుతున్న అడిషనల్ డీజీపీ స్వాతి లాక్రా

పోలీసులు ప్రజలకు అందుబాటులో ఉండాలి

- మావోయిస్టు కార్యకలాపాలపై నిఘా పెట్టాలి
- సైబర్ క్రైమ్ నేరాలపై అవగాహన కల్పించాలి
- జిల్లాను డ్రగ్స్ రహిత జిల్లాగా తీర్చిదిద్దాలి
- హోంగార్డ్స్ ఆర్గనైజేషన్ అడిషనల్ డీజీపీ స్వాతి లక్రా

ములుగు, జనవరి31(నమస్తేతెలంగాణ) : పోలీసులు ఎల్లవేళలా ప్రజలకు అందుబాటులో ఉండి వారు మెచ్చిన విధులను నిర్వహించాలని, ములుగు జిల్లాను డ్రగ్స్ రహిత జిల్లాగా తీర్చిదిద్దడంతోపాటు సైబర్ క్రైమ్ నేరాలపై ప్రజలకు అవగాహన కల్పించడం, మావోయిస్టు కార్యకలాపాలపై నిఘా పెంచడం చేయాలని హోంగార్డ్స్, ఆర్గనైజేషన్ అడిషనల్ డీజీపీ స్వాతి లక్రా అన్నారు. వార్షిక తనిఖీల్లో భాగంగా ములుగు జిల్లా పోలీస్ తనిఖీకి శుక్రవారం స్వాతి లాక్రా ములుగు జిల్లా కేంద్రంలోని ఆర్‌అండ్‌బీ అతిథి గృహానికి చేరుకున్నారు. ఎస్పీ డాక్టర్ పీ శబరీశ్ అడిషనల్ డీజీపీకి పుష్పగుచ్ఛం అందించి స్వాగతం పలుకగా ఆమెకు పోలీసులు గౌరవ వందనం చేశారు. అనంతరం స్వాతి లాక్రా జిల్లా పోలీస్ అధికారులతో సమావేశం నిర్వహించారు. పని తీరును, శాంతి భద్రత నియంత్రణలో భాగంగా తీసుకుంటున్న ముందస్తు చర్యలపై ఎస్పీ పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నేర నియంత్రనలో భాగంగా ములుగు జిల్లా పోలీస్ చేస్తున్న కృషిని, శాంతి భద్రతల్లో తీసుకుంటున్న రక్షణ చర్యలను, లోక్ అదాలత్ ద్వారా కేసుల సత్వర పరిష్కారినిక చేస్తున్న కృషిని ప్రశంసించారు. డ్రగ్స్ రహిత జిల్లాగా ములుగును మార్చాలని అన్నారు. గ్రామీణ యువత నిషేధిత మావోయిస్టు భావజాలానికి లోను కాకుండా ఉద్యోగ అవకాశాలు కల్పించాలని అన్నారు. మావోయిస్టు కార్యకర్తలపై అనునిత్యం నిఘా ఉంచాలని, మావోయిస్టు రహిత జిల్లాగా మార్చాలని ఆదేశించారు. మహిళలకు సంబంధించిన ఫిర్యాదులకు అధిక ప్రాధాన్యత ఇవాలన్నారు. రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం జాకారంలోని డీటీసీ సెంటర్‌ను, ఏఆర్ హెడ్ క్వార్టర్స్‌లోని డాగ్ స్క్వాడ్, ప్రస్తుత డీజీవో భవనాన్ని స్వాతి లాక్రా పరిశీలించారు. సమావేశంలో ఓఎస్డీ గీతే మహేశ్‌బాబా సాహెబ్, ఏఆర్ అడిషనల్ ఎస్పీ సదానందం, ఏటూరునాగారం ఏఎస్పీ శివం ఉపాధ్యాయ, డీఎస్పీ రవీందర్, సీఐలు, ఆర్ఐలు, ఎస్సైలు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

మృతురాలి కుటుంబానికి పరామర్శ

ములుగురూరల్/మంగపేట, జనవరి 31 : ములుగు మండలంలోని దేవగిరిపట్నం గ్రామానికి చెందిన ములుగు బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు సానికొమ్ము రమేశ్‌రెడ్డి నానమ్మ సీతారామమ్మ మృతిచెందగా, రమేశ్‌రెడ్డిని జడ్పీ మాజీ చైర్‌పర్సన్, బీఆర్ఎస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి బడే నాగజ్యోతి పరామర్శించారు. సీతారామమ్మ భౌతిక కాయంపై పూలమాల వేసి నివాళులర్పించారు. కాసిందేవిపేట గ్రామానికి చెందిన మహమ్మద్ సర్వర్ ఇనీయా, మంగపేట మండలంలోని దోమెడకు చెందిన సర్దార్ మృతి చెందగా వారి మృతదేహాలపై పూలమాల వేసి నివాళులర్పించారు. నాగజ్యోతి వెంట మంగపేటలో బీఆర్ఎస్ మండల ప్రధాన కార్యదర్శి గుండేటి రాజుయాదవ్, గౌస్, పూజారి శ్రీనివాస్, తిరుపతి, గ్రామ కమిటీ అధ్యక్షుడు కొమరం లక్ష్మయ్య, పీఏసీఎస్ డైరెక్టర్ కొమరం బాబురావు, పుల్లయ్య, రమేశ్, రత్తయ్య, సాంబులు, సోషల్ మీడియా వారియర్లు శ్రీహరి, సిద్ధు, సతీశ్, బోడ ప్రసాద్ పాల్గొన్నారు.

ఉచిత వృత్తి విద్యా శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

భూపాలపల్లి రూరల్ : భూపాలపల్లి సింగరేణి సేవా సమితి ఆధ్వర్యంలో నిర్వహించనున్న టైలరింగ్, బ్యూటీషియన్, మగ్గం వర్క్స్, ఫ్యాషన్ డిజైనింగ్, జ్యూట్ బ్యాగ్, డీటీపీ ల ఉచిత వృత్తి విద్యా కోర్సులను నేర్పించడానికి ఆసక్తి కలిగిన ఉపాధ్యాయుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నామని ఏరియా అధికార ప్రతినిధి కావూరి మారుతి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. భూపాలపల్లి పట్టణంలోని 1000క్వార్టర్స్‌లో అదనంగా జ్యూట్ బ్యాగ్ వర్క్స్ కోర్సు నిర్వహించడానికి యాజమాన్యం నిర్ణయించింది. ఈ కోర్సులను అతి త్వరలో ప్రారంభించనున్నట్లు తెలిపారు. ఆసక్తి కలిగిన ఉపాధ్యాయులు ఆధార్‌కార్డ్, ఎస్సెస్సీ మెమో, కుల ధృవీకరణ పత్రం, 2 పాస్ పోర్ట్ సైజ్ ఫొటోలతో కూడిన దరఖాస్తును 10వ తేదీలోపు భూపాలపల్లి జనరల్ మేనేజర్ కార్యాలయంలో అందజేయాలని ఆయన తెలిపారు.

‘యుద్ధభేరి’ ని జయప్రదం చేయండి

కాటారం, జనవరి 31 : హనుమకొండలో ఆదివారం జరిగే బీసీ రాజకీయ యుద్ధభేరి సభను జయప్రదం చేయాలని జాతీయ బీసీ సంఘం జిల్లా ఇన్‌చార్జి, బీసీ ఇంటర్నేషనల్ ఫోరం జిల్లా అధ్యక్షుడు పెండ్యాల సంపత్ కోరారు. మండలకేంద్రంలోని అంబేద్కర్ కూడలి వద్ద కాటారం సబ్ డివిజన్ బీసీ సంఘాల ఆధ్వర్యంలో శుక్రవారం యుద్ధభేరి పోస్టర్లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో నాయకులు రాజేశ్, భాస్కర్, రాజు, సతీశ్, రాజేందర్, ప్రభాకర్, రాజయ్య, శంకర్, అశోక్, లక్ష్మణ్, మొగిళి పాల్గొన్నారు.

పోస్టర్లను ఆవిష్కరిస్తున్న బీసీ సంఘం నాయకులు

భారీగా తరలిరావాలి

గణపురం : ఆర్ట్స్ కళాశాలలోని ప్రొఫెసర్ జయశంకర్ ప్రాంగణంలో ఫిబ్రవరి 2న నిర్వహించనున్న బీసీ రాజకీయ యుద్ధబేరికి రాజకీయలకతీతంగా భారీగా తరలిరావాలని ముదిరాజ్ మహాసభ జిల్లా అధ్యక్షుడు సుభాష్ విజ్ఞప్తి చేశారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో సభా వేదిక ద్వారా పెద్దలు దిశానిర్దేశం చేస్తారన్నారు.

ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కేటీపీపీలో నిరసన

గణపురం, జనవరి 31: చండీఘర్, ఉత్తర ప్రదేశ్ రాష్ట్రాల్లోని విద్యుత్ సంస్థల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా యునైటెడ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయీస్ యూనియన్ కేటీపీపీ బ్రాంచ్ అధ్యక్షుడు ఇనుగాల కుమార్ ఆధ్వర్యంలో శుక్రవారం నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా కేటీపీపీలో బ్రాంచ్ అధ్యక్షుడు ఇనుగాల కుమార్, జెన్కో యూనిట్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిలువేరు మల్లయ్య మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చే జీవోను వెంటనే ఉపసంహరించుకోవాలనారు. లేదంటే దేశవ్యాప్తంగా విద్యుత్ కేంద్రాల ఎదుట పెద్దఎత్తున నిరసనలు చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో బ్రాంచ్ సెక్రటరీ పెరుమాండ్ల కృష్ణమూర్తి, జెన్కో జాయింట్ సెక్రటరీ కోడెపాక కిరణ్, బ్రాంచ్ వర్కింగ్ ప్రెసిడెంట్ భూమయ్య, నర్సయ్య, రాకేశ్, రాజేందర్, నారాయణ పాల్గొన్నారు.

కేటీపీపీలో నిరసన తెలుపుతున్న యునైటెడ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయీస్

తిరిగి నియమించాలని..

ఎంఈవో కార్యాలయం ఎదుట మధ్యాహ్న భోజన నిర్వాహకురాలి నిరసన

భూపాలపల్లి రూరల్, జనవరి 31 : అక్రమంగా తొలగించి అన్యాయం చేశారని, వెంటనే తనను మధ్యాహ్న భోజన నిర్వాహకురాలిగా తిరిగి నియమించాలని కోరుతూ భూపాలపల్లి ఎంఈవో కార్యాలయం ఎదుట పొన్నాల భూమమ్మ నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా భూమమ్మ మీడియాతో మాట్లాడుతూ గత 15యేళ్లుగా భూపాలపల్లి మండలంలోని నేరేడుపల్లి ప్రభుత్వ పాఠశాలలో మధ్యాహ్న భోజన నిర్వాహకురాలుగా పనిచేశానని తెలిపారు. గత సంవత్సరం తనకు ఆఫరేషన్ కావడంతో తనతోపాటు వసంత అనే మహిళను తీసుకొని పోయి పిల్లలకు వంట చేసినట్లు తెలిపారు. అకారణంగా నన్ను తొలగించి, వసంతను మధ్యాహ్న భోజన నిర్వాహకురాలిగా నియమించుకున్నారని ఆవేదన వ్యక్తం చేసింది. వసంత డబ్బులు నా బ్యాంకు అకౌంట్‌లో పడ్డాయని, వాటిని ఇవ్వాలని నాపై పోలీస్ స్టేషన్‌లో హెచ్ఎం కేసు కూడా పెట్టారని తెలిపారు. పిల్లలకు అన్ని రకాలుగా వండిపెడితే, తక్కువ బిల్లు పెట్టడంతో రూ.15వేలు అప్పు అయిందని, తిరిగి తనను మధ్యాహ్న భోజన నిర్వాహకురాలిగా నియమించి న్యాయం చేయాలని ఆమె కోరారు.

భూపాలపల్లి ఎంఈవో కార్యాలయం ఎదుట నిరసన చేపట్టిన మధ్యాహ్న భోజన నిర్వాహకురాలు భూమమ్మ

పీఏసీఎస్ నూతన భవనం నుంచి సేవలు

మహాముత్తారం, జనవరి 31 : మండలంలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం కార్యకలాపాలు పాత భవనం నుంచి నూతన భవనంలోకి మారిందని అక్కడి నుంచి బ్యాంకు సేవలు కొనసాగుతాయాని పీఏసీఎస్ చైర్మన్ సోమ శాంతకుమార్ శుక్రవారం తెలిపారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ వెల్మారెడ్డి అనిల్‌రెడ్డి, డైరెక్టర్లు లింగమల్ల చిన్న రాజయ్య, అజ్మీరా సుజాత, జైపాల్‌రెడ్డి, వేల్పుల సమ్మక్క, కంపె రాజయ్య, సోదరి మల్లమ్మ, మహమ్మద్ అల్లావుద్దీన్, సీఈవో మార్క శ్రీధర్, అసిస్టెంట్ సీఈవో చంద శ్రీనివాస్, స్టాఫ్ అసిస్టెంట్ సదానందం, లక్ష్మయ్య, అటెండర్ బాబు పాల్గొన్నారు.

నూతన భవనంలో చైర్మన్‌తో పాటు పాలక సభ్యులు

జిల్లాస్థాయిలో ఆదర్శ విద్యార్థుల ప్రతిభ

గణపురం, జనవరి 31 : జయశంకర్ భూపాలపల్లి జిల్లా కేంద్రంలో ఏబీవీపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన క్రీడా పోటీల్లో మండల కేంద్రంలోని మోడల్ (ఆదర్శ)పాఠశాల విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబరిచి జిల్లా స్థాయి బహుమతులు సాధించారు. శుక్రవారం పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో బహుమతులు సాధించిన విద్యార్థులను పాఠశాల ప్రిన్సిపాల్ ఇమ్మడిశెట్టి తిరుపతి ఉపాధ్యాయ బృందం సన్మానించారు. వారు మాట్లాడుతూ కబడ్డీ క్రీడలో జీ వంశీ, ఖోఖోలో పీ శివ ప్రథమ బహుమతి, వాలీబాల్‌లో ఎల్ శివకుమార్ ద్వితీయ బహుమతి సాధించినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు

శరీర అవయవ దానం మరొకరికి ప్రాణదానం

భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు

రేగొండ, జనవరి 31 : శరీర అవయవ దానం మరొకరికి ప్రాణదానమని ఎమ్మెల్యే గండ్ర సత్యానారయణరావు అన్నారు. మండలంలోని తిరుమలగిరి గ్రామానికి చెందిన గంగుల చంద్రారెడ్డి రోడ్డు ప్రమాదంలో మృతి చెందగా ఆయన నేత్రాలను దానం చేశారు. సదాశియ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నేత్రాలు దానం చేయగా శుక్రవారం శరీర అవయవదానంపై అవగాహన సదస్సు నిర్వహించి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ చేతుల మీదుగా కుటుంబ సభ్యులకు ప్రశంసా పత్రంతోపాటు జ్ఞాపికను అందజేశారు. కార్యక్రమంలో నిర్వాహకులు శ్రవణ్‌కుమార్, వెంకటనారాయణ, గ్రామ మాజీ సర్పంచ్ కట్ల రాణి, గ్రామస్తులు విజేందర్, వెంకటస్వామి, రమణారెడ్డి పాల్గొన్నారు.

సౌర శక్తితో రైతులకు ఆదాయం

టీజీ ఎన్పీడీసీఎల్ భూపాలపల్లి సర్కిల్ ఎస్ఈ మల్ఖార్ నాయక్

కృష్ణ కాలనీ, జనవరి 31 : జయశంకర్ భూపాలపల్లి జిల్లాలోని రైతులు వారికి సంబంధించిన బంజరు భూములు, వ్యవసాయానికి అనుకూలంగా లేని భూముల్లో సౌరశక్తిని ఉత్పత్తి చేసి ఆదాయాన్ని పొందవచ్చని టీజీ ఎన్పీడీసీఎల్ భూపాలపల్లి సర్కిల్ సూపరింటెండింగ్ ఇంజినీర్ బీ మల్ఖార్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. టీజీ రెడ్కో రైతులు, అర్హతగల లబ్ధిదారుల నుంచి సోలార్ ప్లాంట్ పెట్టుకోవడానికి, వాళ్ల పేర్లు పొందుపరచడానికి అవకాశం ఉందన్నారు. 4000 ఎండబ్ల్యూ సోలార్ ప్లాంట్లు, 500కేడబ్ల్యూ నుంచి 2ఎండబ్ల్యూ వరకు ప్లాంట్లు ఏర్పాటు చేసుకోవచ్చని, ఒక మెగావాట్ సౌర విద్యుత్ ప్లాంటు ఏర్పాటుకు 3.5నుంచి 4ఎకరాల భూమి అవసరం ఉంటుందని తెలిపారు. వివరాలు, దరఖాస్తు నమోదు చేసుకోవడానికి www.tgredco.telangana.gov.in . వెబ్ సైట్‌లో లాగిన్ కావాలని కోరారు. ఆసక్తిగల రైతులు ఈనెల 22వ తేదీలకు దరఖాస్తు చేసుకోవాలన్నారు. టీజీ రెడ్కో డీజీఎం 63049 03933, జీఎం 90005 50974 నంబర్లను సంప్రదించి తమ సందేహాలను నివృత్తి చేసుకోవచ్చని ఎస్ఈ కోరారు.

పోలీసు శాఖ ఆధ్వర్యంలో క్రికెట్ టోర్నమెంట్

భూపాలపల్లి రూరల్, జనవరి 31 : జయశంకర్ భూపాలపల్లి జిల్లా స్థాయి క్రికెట్ టోర్నమెంట్‌ను ఫిబ్రవరి 3వ తేదీ నుంచి జిల్లా పోలీసుశాఖ ఆధ్వర్యంలో నిర్వహించనున్నట్లు భూపాలపల్లి సీఐ నరేశ్‌కుమార్ శుక్రవారం ఒక ప్రకటన లో తెలిపారు. జిల్లా స్థాయి క్రికెట్ టోర్నమెంట్‌లో దాదాపు 30క్రికెట్ టీంలు పాల్గొంటున్నాయని తెలిపారు. మీడియా టీంను సెలెక్ట్ చేసి లిస్ట్‌ను చిట్యాల ఎస్సైకి అందజేయాలని ఆయన సూచించారు. మొదటి మ్యాచ్ సింగరేణి, మీడియా టీంల మధ్య జరుగుతుందని సీఐ నరేశ్ తెలిపారు.

ఆదర్శ పాఠశాలలో దరఖాస్తులకు ఆహ్వానం

గణపురం : మండల కేంద్రంలోని తెలంగాణ ఆదర్శ పాఠశాల, కళాశాలలో 2025-26కు అడ్మిషన్ల కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ తిరుపతి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. 6వ తరగతిలో 100 సీట్లు, 7వ తరగతి నుంచి 10వ తరగతి వరకు మిగిలిన సీట్లకు నోటిఫికేషన్ ఇచ్చినట్లు తెలిపారు.

ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలి

కాటారం, జనవరి 31 : ఉపాధ్యాయుల సమస్యలను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని రాష్ట్రీయ